సాక్షి
జనగామ
గురువారం 14 సెప్టెంబర్ 2023



'విలీనం'పై మాట్లాడే హక్కులేదు

తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు బీజేపీ, బీఆర్ఎస్‌కు లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు అన్నారు. - 8లో▸



8 నిమిషాల్లోనే చోరీ..!

ఈ నెల 5న వరంగల్‌లోని అపార్ట్‌మెంట్‌ల్లో చోరీలకు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30^0 /24^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైభవంగా సోమేశ్వర స్వామి మాస కల్యాణం



పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. చండిక అమ్మవారి ఆలయంలో చండికా సమేత శ్రీసోమేశ్వర స్వామి వారికి మాస కల్యాణం మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా జరిగింది. ఈ కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని కనులరా తిలకించి తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరిని విజయవంతం చేయండి

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి



జనగామ: హైదరాబాద్ తుక్కుగూడలో ఈ నెల17న కాంగ్రెస్ నిర్వహించ తలపెట్టిన విజయభేరి భారీ బహిరంగ సభకు విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విజయభేరి సభకు ఏఐసీసీ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియంక గాంధీ రానున్నారన్నారు. బహిరంగసభకు జిల్లా నుంచి భారీగా జనసమీకరణ ఉంటుందన్నారు. కాగా హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి జాతీయ రహదారి నెల్లుట్ల బైపాస్ వద్ద కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమళ్ల సత్యనారాయణరెడ్డి, చారబుడ్ల రాందయాకర్ రెడ్డి, జిల్లెల్ల సిద్దారెడ్డి, ధర్మ గోవర్ధన్‌రెడ్డి, ఉడత రవి యాదవ్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, బనుక శివ రాజ్, ఎండీ అన్వర్, మోటే శ్రీనివాస్, లింగాల నర్సిరెడ్డి, బొట్ల నర్సింగరావు, బాల్‌రెడ్డి, పిట్టల సతీష్, ఆకుల లక్ష్మయ్య, జాయ మల్లేష్, కడారు ప్రవీణ్, మధు, సిద్దులు, బీరప్ప, ఉదయ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులు లేకుండా కళాశాల ప్రారంభం సరికాదు

- జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు



జనగామ రూరల్: అనేక పోరాటాలు, కేసులు ఉన్న ఉద్యమకారులు లేకుండా మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం సరికాదని జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు అన్నారు. బుధవారం జేఏసీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, మంగళంపల్లి రాజు మాట్లాడుతూ ఉద్యమాలు ఒకరు చేస్తే దాని ఫలితం మరొకరు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. జేఏసీ నాయకులు అనేక పోరాటాల ఫలితంగా మెడికల్ కళాశాల వచ్చిందని, సంబురాలు మాత్రం మంత్రి, ఎమ్మెల్యేలు చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో 4 రోజుల పాటు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుంగ కౌశిక్, ఆసర్ల సుభాష్, సల్ల మహేష్, అనిల్ చౌహాన్, అజయ్ పాల్గొన్నారు.

టెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- హాజరు కానున్న 4,343 మంది అభ్యర్థులు

జనగామ రూరల్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్ష నిర్వాహకులకు బుధవారం జిల్లా పరీక్షల అధికారి ఆర్డర్ కాపీ అందజేశారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1కు 2,258 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పేపర్-2కు 2,085 మంది మొత్తం 4,343 హాజరు కానున్నారు. సమస్యలు తలెత్తకుండా డీఈఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్ 6304062768 ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలకు గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం వరకు సెలవు ప్రకటించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఫీవర్.. ఫియర్

విషజ్వరాలతో జనం విలవిల

- రోజుకు 300 వరకు ఓపీ, 30 మందికిపైగా అడ్మిట్
- జనరల్ వార్డులు ఫుల్.. ఆరు బయటే సేవలు
- 24/7 గంటల పాటు వైద్యసేవలు
- జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సేవలపై సాక్షి విజిట్

సాక్షి విజిట్



జిల్లా ఆస్పత్రిలోని జనరల్ వార్డులో అడ్మిట్ అయిన రోగులు



జనగామ జిల్లా ఆస్పత్రిలో ఓపీ క్యూ

ఐదు నెలల జిల్లా ఆస్పత్రి వివరాలు

నెల	ఓపీ	అడ్మిట్
ఏప్రిల్	6,258	780
మే	7,536	630
జూన్	7,897	677
జూలై	7,864	659
ఆగస్టు	3,661	718

జనగామ: ఉదయం ఉక్కపోత.. సాయంత్రం ఈదురుగాలులు.. మధ్యలో చిటపట చినుకులతో వాతావరణంలో ఏర్పడుతున్న వింత పరిస్థితులతో పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నా.. వేసవిని తలపించే విధంగా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. దీంతో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే పేషెంట్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. ఒకటి, రెండు రోజుల్లో తగ్గిపోయే జ్వరం కాస్తా... ఐదు రోజులు గడిచినా విడిచి పెట్టడం లేదు. సీజనల్ వ్యాధుల విజృంభణ నేపథ్యంలో డిస్ట్రిక్ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై బుధవారం సాక్షి విజిట్ చేసి, చికిత్స పొందుతున్న రోగులను పలకరించింది.

జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగీ, చికున్ గున్యా కేసులు నమోదు కానప్పటికీ.. తీవ్ర జ్వర పీడితులు మాత్రం పెరుగుతున్నారు. 12 మండలాల నుంచి జిల్లా ఆస్పత్రికి రోజువారీగా వచ్చే పేషెంట్ల అడ్మిట్ సంఖ్య, ఓపీ పెరగడమే ఇందుకు కారణం. వాతావరణంలో వస్తున్న అనేక మార్పులు ప్రజలపై ప్రభావం చూపిస్తున్నాయి. జనగామ మున్సిపల్‌తో పాటు గ్రామాల్లో శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో దోమల స్వైర విహారం సైతం అనారోగ్యానికి కారణంగా చెప్పుకోవచ్చు. జిల్లా ఆస్పత్రికి బుధవారం ఉదయం 8 గంటల వరకే రద్దీ పెరిగింది. ఓపీ సెంటర్‌లో పేర్లను ఆన్‌లైన్ నమోదు చేసిన తర్వాత, రోగ నిర్ధారణ పరీక్ష చేశారు. ఒంటి నొప్పులు, తీవ్ర జ్వరం ఉన్న బాధితులను అడ్మిట్ చేసుకుని, సాధారణ అనారోగ్య పరిస్థితులతో ఉన్న వారికి మందులు ఇచ్చి పంపించారు. మెడికల్ ఓపీ, సర్జికల్ ఓపీ, అన్ని డిపార్ట్‌మెంట్‌ల వారీగా 24 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలోని మూడు జనరల్ వార్డులు పేషెంట్లతో నిండి, ఆరు బయట చికిత్స అందించే పరిస్థితి ఉంది.

డెంగీ, చికున్ గున్యా లేదు..

జిల్లాలో ఇప్పటి వరకు డెంగీ, చికున్‌గున్యా కేసులు నమోదు కాలేదు. ఇందుకు సంబంధించిన కేసులు నమోదైనా.. మెరుగైన వైద్య పరీక్షలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారు. ప్లేట్ లెట్స్ తగ్గి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అత్యవసరంగా అందించేందుకు సేవలు అందుబాటులో ఉంచారు.

24/7 గంటల వైద్యసేవలు..



డెంగీ, మలేరియా కేసులు నమోదు కాలేదు. ప్లేట్‌లెట్ తక్కువగా ఉన్న పేషెంట్లు కూడా లేరు. ఇందుకు సంబంధించిన పూర్తి వైద్యం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో ఉంది. మెడికల్, సర్జికల్, అన్ని డిపార్ట్‌మెంట్ల వారీగా ఓపీ సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. సీజనల్ వైరల్ ఫీవర్లు, వాంతులు, దగ్గు, జలుబు, విరేచనాలు, నిమోనియా కేసులు మాత్రం బాగానే ఉన్నాయి. డెంగీ, చికున్‌గున్యా, మైక్రోబయోలజీ టెస్ట్ కిట్లు సరిపడా అందుబాటులో ఉన్నాయి. పాము, తేలు కాటుతో పాటు ఇతర జనరల్ మందులు సరిపడా అందుబాటులో ఉన్నాయి. అనారోగ్య పరిస్థితులతో సీరియస్‌గా మారి, డయాలసిస్ అవసరమైన సమయంలో మాత్రమే వరంగల్, హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తాం. వైద్యులు డ్యూటీల వారీగా అన్ని విభాగాల్లో 24/7 గంటల సేవలు అందిస్తున్నారు.

-డాక్టర్ అనురాధ, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్



పై ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బొమ్మగాని యాదగిరిగౌడ్, కొడకండ్ల మండలం రామవరం గ్రామం. జ్వరంతో బాధపడుతున్న ఈయనను భార్య బాలమ్మ మూడు రోజుల క్రితం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చింది. వైద్యులు పరీక్షలు చేసి, ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. నిరంతరం వైద్యం అందిస్తున్నా.. ఒంటి నొప్పులు తగ్గడం లేదని యాదగిరి బాధపడుతున్నాడు. ఇలా జిల్లా వ్యాప్తంగా చాలా మంది జ్వరం, ఒంటినొప్పులతో బాధపడుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో 8రోజుల ఓపీ, అడ్మిట్ కేసుల వివరాలు

తేదీ	ఓపీ	అడ్మిట్	తేదీ	ఓపీ	అడ్మిట్
05	307	24	09	326	31
06	333	29	10	200	20
07	333	26	11	413	42
08	345	23	12	372	22
			13	390	30

వారంలో 3 వేల ఓపీ..

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గడిచిన వారం రోజుల్లో 3,019 మంది ఓపీలో తమ పేర్లు నమోదు చేసుకోగా, వివిధ అనారోగ్య కారణాలచేత 247 మంది అడ్మిట్ అయ్యారు. 3రోజుల నుంచి 10 రోజులుగా ఆస్పత్రిలోనే చికిత్స పొందున్నారు.

పదిరోజుల క్రితం అడ్మిట్ అయ్యా..



కడుపులో గడ్డ పెరిగిన సమయంలో వైద్యం కోసం పదిరోజుల క్రితం జిల్లా ఆస్పత్రికి వచ్చాను. ఆపరేషన్ చేసి గడ్డ తొలగించే లోపే తీవ్ర జ్వరం రావడంతో డాక్టర్లు తాత్కాలికంగా వాయిదా వేశారు. జ్వరంతో పాటు ఒంటి నొప్పులు ఉండడంతో వాటికి సంబంధించిన ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నారు. ఎప్పటికప్పుడు బీపీ చెకప్ చేసి, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్నారు.

-చాగంటి శివరాజ్, కుర్చపల్లి, రఘునాథపల్లి

రాష్ట్ర పాలన మార్గదర్శకం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల: దేశంలోనే తెలంగాణ ప్రభుత్వ పాలన మార్గదర్శకంగా మారిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల సమన్వయకర్త పల్ల సుందర్‌రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ ఆధ్వర్యంలో సింగరాజుపల్లి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌పై నమ్మకంతో యువత పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు బస్వ మల్లేషమ్, చామల విక్రమ్ రెడ్డి, జోగు సోమనర్సయ్య, కోతి ప్రవీణ్, రాజు, నవీన్ నాయక్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ మేళా ప్రారంభం



దాతలను సత్కరిస్తున్న కలెక్టర్

జనగామ: కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఆయుష్మాన్ భవ మేళా కార్యక్రమాన్ని బుధవారం ఢిల్లీ నుంచి సంబంధిత శాఖ మంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రశాంత్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అశోక్‌కుమార్, భాస్కర్, మాస్ మీడియా అధికారి ప్రభాకర్ తదితరులు వర్చువల్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు 16 రోజుల పాటు ఆయుష్మాన్ సభలు నిర్వహించనున్నారు. టీబీ పేషెంట్లకు ప్రభుత్వం నెలకు రూ.500 అందిస్తుండగా, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్ కుమార్తె లగిశెట్టి అయిషిత, డాక్టర్ భాస్కర్, సివిల్ సప్లయీస్ డీఈ ఇట్టబోయిన శ్రీనివాస్‌లు 6 నెలలుగా 120మంది రోగులకు పోషక విలువలతో కూడిన కిట్లను అందిస్తున్నారు. వీరిని కలెక్టర్ శాలువాతో సత్కరించి, అభినందించారు.

కొత్త పంట రుణాలు ఇవ్వండి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: జిల్లాలో రూ.లక్ష రుణం మాఫీ పొందిన రైతులకు తిరిగి కొత్త పంట రుణాలను అందించాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ హాల్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సంప్రదింపుల కమిటీ (డీసీసీడీఎల్ఆర్‌సీ) బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ జాబితాలో పేరు ఉండి, అర్హత కలిగిన ప్రతి రైతుకు కొత్త పంట రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 35,569 మంది రైతులకు రూ.197.53కోట్ల వరకు రుణమాఫీ జరిగిందన్నారు. ఇంకా 58,292 మంది రైతులకు రూ.284.58 కోట్లు విడతల వారీగా మాఫీ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్‌డీఓ తేజ్ దీప్తి బేహర, నాబార్డు అధికారి రవి, డీఆర్డీఓ రాంరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.శ్రీధర్, బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

జనగామ రూరల్: ఈ నెల 17న జాతీయ సమైక్యతా దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చేయాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17న ఆదివారం కలెక్టరేట్ సముదాయంలో ఉదయం 9 గంటలకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. అందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మురళీకృష్ణ, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీఆర్డీఓ రాంరెడ్డి, ఇస్మాయిల్, డీఈఓ రాము, ఏఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామాలుగా సిరిపురం, కూనూర్

స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా జిల్లాలోని లింగాలఘణపురం మండలంలోని సిరిపురం, జఫర్‌గఢ్ మండలం కూనూర్ గ్రామాలు ఎంపికయ్యాయి. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సంబంధిత అధికారులు, సర్పంచ్‌లను కలెక్టర్ శివలింగయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం సిరిపురం సర్పంచ్ మర్రి లక్ష్మి భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి బి.శంకర్, కూనూర్ గ్రామ సర్పంచ్ ఈ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, కార్యదర్శి రాజేశ్వర్‌లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. నేడు (గురువారం) హైదరాబాద్‌లో జరిగే సన్మాన కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి చేతుల మీదుగా బహుమతులు అందుకుంటారన్నారు.

న్యూట్రిషన్ కిట్ల కోసం పడిగాపులు

- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు



ఎంసీహెచ్‌లో నిరీక్షిస్తున్న గర్భిణులు

జనగామ: రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ కిట్టు వెబ్‌సైట్‌లో టెక్నికల్ సమస్య తలెత్తడంతో జనగామ ఎంసీహెచ్‌లో బుధవారం గర్భిణులు గంటల తరబడి నిరీక్షించారు. ప్రభుత్వం ఐదు నెలల నుంచి పోషక విలువలతో కూడిన న్యూట్రిషన్ కిట్లను అందిస్తుంది. తల్లీ,బిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 3వ నెల నుంచి 6వ నెల వరకు, 7వ నెల నుంచి డెలివరీ వరకు రెండు సార్లు ఈ కిట్లను అందిస్తారు. ఎంసీహెచ్‌లో నెలవారి చెకప్ పూర్తయిన తర్వాత, 3, 7వ నెల గర్భిణులు న్యూట్రిషన్ కిట్ల కోసం వెళ్లగా వెబ్‌సైట్‌లో టెక్నికల్ సమస్య రావడంతో సాయంత్రం 4 గంటల వరకు అక్కడే నిరీక్షించారు. అయినా సైట్ ఓకే కాకపోవడంతో ఉసూరుమంటూ వెళ్లిపోయారు. 3వ నెల సమయంలో న్యూట్రిషన్ కిట్లు రాలేదు, 7వ నెల సమయంలో ఎంసీహెచ్‌లో చెకప్ చేసుకున్న తర్వాత కిట్ల కోసం ఆరు గంటల పాటు నిరీక్షించినా.. కిట్లు ఇవ్వలేదని గర్భిణీ రజని తెలిపింది.

వారోత్సవాలను జయప్రదం చేయండి

జనగామ రూరల్: సెప్టెంబర్ 17న పట్టణంలో జరిగే తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాలు జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో అహల్య అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ సాయుధ పోరాటం ఫలితంగానే దేశంలో భూ సంస్కరణల అమలుకు నాంది పలికిందన్నా రు. పేదలకు భూ పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టులకే చెందుతుందన్నారు. రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, జోగు ప్రకాష్, విజేందర్, చందు, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో ట్రయల్ రన్

- ప్రొజెక్టర్ ఏర్పాటు, డీఎంఈ జూమ్ మీటింగ్
- లెక్చరర్ హాల్-1, 2 పనులు పూర్తి
- పనులను పరిశీలించిన అధికారులు
- కరెంట్ సరఫరా ఇంకెప్పుడో?



పనులను పరిశీలిస్తున్న అధికారులు

జనగామ: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా వర్చువల్‌గా ఈ నెల 15న ప్రారంభించనున్న జనగామ మెడికల్ కళాశాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. లెక్చరర్ -1, 2 హాల్ (తరగతి గదులు) సిద్ధం కాగా, లైబ్రరీ ఇతర పనులు పూర్తి కావాల్సి ఉంది. వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమం సజావుగా నడిచేలా లెక్చరర్ హాల్-1లో ప్రొజెక్టర్ ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి గత రెండు లైవ్ ప్రోగ్రాంలను ట్రయల్ రన్ ద్వారా పరిశీలన చేస్తున్నారు. ప్రారంభం రోజు ఎక్కడా కూడా సాంకేతిక సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి జూమ్ ద్వారా ఇక్కడి పనులను అడిగి తెలుసుకున్నారు. ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ సుగుణాకర్‌రాజు ఆయా శాఖల అధికారులతో కలిసి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రెడ్డి కళాశాల పనులను తనిఖీ చేశారు. తాత్కాలిక మెడికల్ కళాశాల పనులు చివరి దశకు చేరుకుంటున్న సమయంలో.. నేటికి విద్యుత్ సరఫరా లేకపోవడం గమనార్హం. కరెంటు సరఫరా నిలిచిపోయిన సమయంలో ప్రత్యామ్నాయంగా జనరేటర్ కూడా ఏర్పాటు చేయలేదు.

పకడ్బందీగా ప్రారంభ ఏర్పాట్లు



జనగామ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తున్నాం. సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనుండగా ఇక్కడ మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. పనుల పురోగతికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం.

-సీహెచ్ శివలింగయ్య, కలెక్టర్

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎమ్మెల్యే రాజయ్య కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన నిరసన దీక్షలకు బుధవారం ఎమ్మెల్యే రాజయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టడంతో పాటు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగ జాతిలో పుట్టిన మనం కలిసికట్టుగా ఆత్మగౌరవ పోరాటం చేసి లక్ష్యాన్ని సాధించుకుందామన్నారు.

రూ.10కోట్లతో అభివృద్ధి పనులు

చిల్పూరు: ఇటీవల సీఎం కేసీఆర్ చిల్పూరుగుట్ట ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయగా ఆ నిధులతో త్వరలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. బుధవారం అధికారలతో కలిసి జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా ఆలయ అభివృద్ధికి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలంటూ కోరగా మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు కడియం, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య అందరు కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. మొదటి విడతగా స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.10కోట్లు మంజూరు చేశారన్నారు. అందులో భాగంగా త్వరలో చేపట్టే అభివృద్ధి పనులపై సమీక్షించామన్నారు. స్థపతి ఇచ్చే దానిపై పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ చంద్రశేఖర్, డీఈ రాజగోపాల్‌రావు, ఏఈ సురేష్, కాంట్రాక్టర్ నర్సింహారెడ్డి, మండల రైతు కోఆర్డినేటర్ జనగాం యాదగిరి, కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.34లక్షల విలువైన బంగారు పూలు విరాళం



బంగారు పూలు అందజేస్తున్న దాతలు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన దాతలు రూ.34.82 లక్షల విలువైన బంగారు పూలు, పాదపద్మం అందజేశారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ హైదరాబాద్‌కు చెందిన కన్నంతరెడ్డి జ్యోతి కుమారులు వినయ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డితో పాటు మల్లికార్జున్ రెడ్డిలు 554 గ్రాముల బంగారంతో చేయించిన 108 తామర పూలు, మూడున్నర కిలోల వెండితో ప్రత్యేకంగా చేయించిన స్వామి వారికి పాదపద్మం ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల సమక్షంలో ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ప్రస్తుతం ఆలయాల్లో అష్టదల పాదపద్మ సేవ కార్యక్రమాల్లో బంగారు తామరపూలు, వెండి పాదపద్మం వాడుతున్నారని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటివి ఎక్కడా లేవని, బుగులు వెంకన్న తమ ఇలవేల్పు కావడంతో వీటిని అందజేయడం జరిగిందన్నారు. ఈ నెల 26న ఆలయంలో ప్రత్యేక పూజలకు వాడనున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ రాజ్‌కుమార్, గొల్లపల్లి వాసు, నీల రాజు, సిబ్బంది రమేష్, వీరన్న, మల్లికార్జున్, వసంత, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరికృష్ణ, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, రవీందర్ ఉత్తమరావు దళ్విలను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు



సోనియాగాంధీ సభకు లక్షలాదిగా తరలాలి

- వివరాలు 8లో▸

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపు

హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని విష్ణుప్రియ గార్డెన్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ సభకు ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

- హన్మకొండ

వృద్ధురాలి కళ్లలో కారం చల్లి..

- మెడలోని రెండున్నర తులాల బంగారం అపహరణ
- ఉదయం 5గంటలకే కరీమాబాద్ కురుమవాడలో ఘటన
- ఘటనా స్థలిని సందర్శించిన సీఐ సురేష్, క్లూస్ టీం
- పోలీసుల అదుపులో అనుమానితురాలు..!



బాధితురాలు వినోదను పరామర్శిస్తున్న కార్పొరేటర్ మరుపల్లి రవి

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఓ ఘటన మరవక ముందే.. మరో చోట చోరీలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా ఉర్సు కరీమాబాద్ కురుమవాడలో చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మిల్స్‌కాలనీ పీఎస్ పరిధి కరీమాబాద్ కురుమ వీధిలో వృద్ధురాలు మజ్జిగ వినోద తన ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఈ విషయం తెలిసిన ఓ గుర్తు తెలియని మహిళ బుధవారం ఉదయం 5గంటలకే వృద్ధురాలి ఇంటికి చేరుకుని తలుపు కొట్టింది. తలుపు తీయగానే సదరు మహిళ.. వృద్ధురాలి కళ్లలో కారం చల్లి క్షణాల్లో మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలు లాక్కొని పరారైంది.దీంతో వృద్ధురాలు లబోదిబోమంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ సీఐ సురేష్, క్లూస్ టీం ఘటనా స్థలికి చేరుకుంది. చోరీ జరిగిన ఇంటిని పరిశీలించింది. అనంతరం వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానిత మహిళను విచారించిన పోలీసులు..!

కరీమాబాద్‌లో అనుమానాస్పదంగా కనిపించిన ఓ మహిళను బుధవారం మధ్యాహ్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చోరీ జరిగిన ఇంటి సమీపంలోని సీసీ ఫుటేజీని పరిశీలించగా ఓ మహిళ రోడ్డుపై ఆందోళనగా వెళ్తున్నట్లు కనిపించింది. సదరు మహిళ గతంలో ఆ ఇంటి సమీపంలోనే అద్దెకు ఉన్నట్లు సమాచారం. రెండురోజుల క్రితం ఆ మహిళ.. వృద్ధురాలు వినోదను కలిసి ఇల్లు అద్దెకిస్తారా అంటూ అడిగి వెళ్లినట్లు తెలుస్తోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు ఆ మహిళను అదుపులోకి తీసుకుని విచారించి వదిలేసినట్లు సమాచారం.

చింతల్‌లో బెల్ట్‌షాపులో చోరీ..

వరంగల్ చింతల్‌లో ఓ బెల్ట్‌షాపులో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి 10గంటల బెల్ట్ షాపు గదికి తాళం వేసి ఇంటికి వెళ్లిన వ్యాపారి.. ఉదయం వచ్చి చూసే సరికే తాళం పగులగొట్టి ఉంది. షాపులోని ఐదు మద్యం ఫుల్ బాటిళ్లు, రూ.3వేల నగదు చోరీకి గురైంది. దీనిపై మిల్స్ కాలనీ పోలీసులను వివరణ కోరగా బాధితులు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



8 నిమిషాల్లోనే చోరీ..!

వరంగల్ నగరంలోని 9 అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడిన ముఠా అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ రంగనాథ్

- రూ.2 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు స్వాధీనం
- రూ.5.20 లక్షల విలువైన 104 కిలోల గంజాయి పట్టివేత
- కారు, పిస్తోల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: చోరీల్లో ఆ ముఠా స్టైలే వేరు.. వీరిని చూస్తే ఎవరికీ అనుమానం కలుగదు. మొదట వాకీటాకీలో సంభాషించుకుంటారు. అనంతరం ప్రొఫెషనల్స్‌గా అపార్ట్‌మెంట్లలోకి ఎంట్రీ అవుతారు. ఈ సమయంలో వీరిని ఎవరైనా చూస్తే ఏ ప్రభుత్వ అధికారులో, లేక కార్పొరేట్ కంపెనీ అధికారులో అనుకుంటారు. ఇక్కడ ఏమైనా పని ఉందో.. అందుకే వచ్చారనుంటారు. ఇదే వీరికి కలిసిచ్చే అంశం. సాంకేతిక పరిజ్ఞానంతో క్షణాల్లో పకడ్బందీగా చోరీలు చేస్తారు. కేవలం 8 నిమిషాల్లోనే ఇల్లును గుల్ల చేసి దర్జాగా బయటకు వస్తారు.. ఇలా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు సీపీ ఏ.వి రంగనాథ్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2 కోట్ల విలువైన సుమారు 2 కిలోల 380 గ్రాముల బంగారం, వజ్రా ఆభరణాలు, రూ.5.20 లక్షల విలువైన 104 కిలోల గంజాయితో పాటు ఒక పిస్తోల్, 5 రౌండ్లు, కారు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు వాకీటాకీలు, నాలుగు నకిలీ ఆధార్ కార్డులు, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

వరుస చోరీలు..

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఘజీయాబాద్‌కు చెందిన అక్బర్ ఖురేషీ, మీరట్ జిల్లాకు చెందిన కపిల్ జాటోవ్, ఘజీయాబాద్‌కు చెందిన మహ్మద్ షరీఫ్, మహ్మద్ షహజాద్ ఖాన్.. ఈనెల 4వ తేదీన ఆదిలాబాద్, 5వ తేదీన వరంగల్ పోలీస్ కమిషనరేట్, 6వ తేదీన బెంగళూరులో వరుస చోరీలకు పాల్పడ్డారు. ఈనెల 5వ తేదీన వరంగల్ కమిషనరేట్‌లోని మట్టెవాడ, హనుమకొండ, సుబేదారి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడ్డారు. దీంతో క్రైం డీసీపీ దాసరి మురళీధర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి ఆదిలాబాద్, బెంగళూరులో జరిగిన చోరీల తీరు కదలికలకు సంబంధించి సీసీ దృశ్యాలతో వివరాలు సేకరించి ఈ తరహా చోరీలు ఎక్కడెక్కడ జరిగాయే నిర్ధారించారు. ఇదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో మే 4వ తేదీన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు జరగడంతో సీఐ శంకరయ్య సహకారంతో నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తులో వేగం పెంచారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం...

నిందితులు వ్యసనాలకు అలవాటు పడి తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యం చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పలుమార్లు జైళ్లకు వెళ్లి బయటకు వచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలో కారు కొనుగోలు చేసి ఈనెల 3న ఢిల్లీ నుంచి బయలుదేరి 4న హైదరాబాద్, 5న మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 03, హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 04, సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో 02 అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడ్డారు. అదే కారులో బెంగళూరు వెళ్లి అక్కడ నాలుగు చోరీలకు పాల్పడ్డారు. అనంతరం తమ వద్ద ఉన్న డబ్బుతో గంజాయి కొనుగోలు చేసి విక్రయించేందుకు వరంగల్ మీదుగా ఢిల్లీకి వెళ్తున్నారు. ఈ క్రమంలో సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అనుమానాస్పదంగా కనిపించారు. ఆపే క్రమంలో తప్పించుకునేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఈ ముఠా ఇప్పటి వరకు 16 చోరీలకు పాల్పడగా అందులో రెండు తెలుగు రాష్ట్రాలలో 10వరకు ఉన్నాయని సీపీ రంగనాథ్ వివరించారు.

అధికారులకు అభినందనలు..

నిందితులను సకాలంలో పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేయడంలో సహకరించిన కర్నూల్ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, కర్నూల్ ఫోర్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్యకు సీపీ రంగనాథ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. దీంతో పాటు డీసీపీ మురళీధర్, క్రైం ఏసీపీ మల్లయ్య, మట్టెవాడ, మహిళా పోలీస్‌స్టేషన్, సీసీఎస్, హన్మకొండ, సుబేదారి ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సూర్యప్రసాద్, శంకర్‌నాయక్, కరుణాకర్, షుకూర్, ఏఏఓ సల్మాన్ పాషా, ఎస్సైలు విఠల్, అనిల్, సంపత్‌కుమార్, రాజేందర్, బాబురావు, యాదగిరి, ఏఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, ఇతర సిబ్బందిని సీపీ రంగనాథ్ అభినందించారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

- భార్యకు ఉద్యోగం, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- వివిధ కార్మిక సంఘాల నాయకుల డిమాండ్
- బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ అర్బన్ : విధుల్లో భాగంగా దోమల నివారణకు ఫాగింగ్ చేస్తూ మృతి చెందిన ఎర్ర రాజు భార్యకు ఉద్యోగం కల్పించి, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట మృతుడి కుటుంబీకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుడు రాజు.. 60 డివిజన్‌లో ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో ఫాగింగ్ చేస్తుండగా పొగ ముక్కులో చేరి ఊపిరాడక మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, సీఎంహెచ్‌వో రాజేష్‌తో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, టీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగా రాఘవరెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నాయిని రవి, తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. పరిహారంపై మేయర్‌తో చర్చించి అందజేస్తామని, కార్మికుడి భార్య కు ఉద్యోగం కల్పిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

గుండెపోటుతో బల్దియా వాహన డ్రైవర్ మృతి..

ఖిలా వరంగల్‌కు చెందిన బల్దియా వాహన డ్రైవర్ జనార్దన్ బుధవారం బాలసముద్రంలో గుండెపోటుతో మృతి చెందారని కార్మిక సంఘాల నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జనార్దన్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కేసు నమోదు

కాజీపేట: హనుమకొండ సర్కిల్‌లో మలేరియా విభాగంలో పని చేస్తూ అస్వస్థతకు గురై మృతి చెందిన ఎర్ర రాజు (40) భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ సార్ల రాజు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ప్రణయ్‌భాస్కర్, ప్రశాంత్‌నగర్ కాలనీల సమీపంలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్స్ వద్ద దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తుండగా పొగలో చిక్కుకుపోయి ఊపిరాడక తుదిశ్వాస విడిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మృతదేహానికి పోస్టమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.



కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో చర్చల్లో వివిధ కార్మిక సంఘాల నాయకులు

సోనియాగాంధీ సభకు లక్షలాదిగా తరలాలి



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఓరుగల్లుది కీలక పాత్ర

- నాయకులు, కార్యకర్తలు శక్తినంతా ప్రదర్శించాలి
- సీడబ్ల్యూసీ సమావేశాలు తెలంగాణలో జరగడం గర్వకారణం
- టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డి



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

హన్మకొండ: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ సభకు ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని విష్ణుప్రియ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఓరుగల్లుది కీలక పాత్ర అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఇద్దరు నుంచి ముగ్గురు ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీ పడుతున్నారని, వీరంత ప్రజలను తరలించేందుకు పోటీ పడాలన్నారు. కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు శక్తినంతా ప్రదర్శించాలన్నారు. సీడబ్ల్యూసీ సమావేశాలు తెలంగాణలో జరగడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ బహిరంగ సభకు స్థలం ఇవ్వకుండా ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ కలిసి కుట్ర పన్నితే రంగారెడ్డి జిల్లా రైతులు తామున్నామంటూ ముందుకువచ్చి 200 ఎకరాల స్థలం ఇచ్చారన్నారు. ఆ రైతుల స్ఫూర్తిని కాకతీయ గడ్డ పౌరులు అర్థం చేసుకోవాలన్నారు. ఈ నెల 17న తుక్కుగూడలోని రాజీవ్ గాంధీ ప్రాంగణంలో విజయభేరి మోగించేందుకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ వస్తున్నారన్నారు. అమరుల తల్లుల కడుపుకోత గుర్తించి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ద్రోహి కాబట్టే సోనియా గాంధీ వస్తుంటే అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఆంధ్రా వారితో సీఎం కేసీఆర్, కేటీఆర్ అంటకాగుతూ తన చిత్తశుద్ధిని శంఖిస్తున్నారని, వీరు తన ఎడమకాలి చెప్పుకు సరిపోరని ధ్వజమెత్తారు. 'అమరవీరుల స్థూపం ప్రారంభించి వంద రోజులు కాకముందే పగుళ్లు పట్టాయని, ఆ స్థూపం కాంట్రాక్టు కూడా ఆంధ్రా వాళ్లకు ఇచ్చిన మీరా నా చిత్తశుద్ధిని శంఖించేదని ప్రశ్నించారు.' మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పక్కన పెట్టి మాయమాటలతో ప్రజలను వంచిస్తున్నారని, చివరకు విలేకరులకు కూడా మోసం చేశారన్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని భావించిన ప్రజలకు కేసీఆర్ చేసింది ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీందర్ ఉత్తమరావు దళ్వి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భారీ ఎత్తున ప్రజలను తరలించాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, కాంగ్రెస్ వరంగల్, మహబూబాబాద్, జనగామ జిల్లాల అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, ఆయిత ప్రకాష్ రెడ్డి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, నాయకులు కొండా సురేఖ, సిరిసిల్ల రాజయ్య, కొండా మురళీధర్ రావు, సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, వేం నరేందర్ రెడ్డి, కూచన రవళి, దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

వీసీపై విచారణ కమిటీని నియమిస్తాం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : వందరోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, వెంటనే కాకతీయ యూనివర్సిటీ వీసీ రమేష్‌పై విచారణ కమిటీని నియమిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై ఆందోళన చేస్తే పోలీసులతో తీవ్రంగా కొట్టించడం దారుణమని వీసీ, రిజిస్ట్రార్‌ల తీరుపై మండిపడ్డారు. కేయూలో కొనసాగుతున్న విద్యార్థి జేఏసీ నిరసన దీక్ష శిబిరాన్ని బుధవారం సాయంత్రం డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గాయపడిన విద్యార్థులను పరామర్శించి మాట్లాడారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి బ్రంటోతుగా మారిన వ్యక్తిని కేయూ వీసీగా నియమించారని విమర్శించారు. కేయూ, ఓయూ విద్యార్థుల పోరాటాలతోనే మీ కుటుంబానికి పదవులు వచ్చాయని కేసీఆర్‌పై మండిపడ్డారు. కేయూలో జరుగుతున్న అక్రమాలకు పల్లారాజేశ్వర్‌రెడ్డి కారణమన్నారు. వీసీ, రిజిస్ట్రార్లను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలు చేస్తున్న వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు.అనంతరం జ్యూస్ ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. కేయూ విద్యార్థి జాక్ చైర్మన్ తిరుపతి యాదవ్, నాయకులు మేడ రంజిత్, మొగిలి వెంకటరెడ్డి, డాక్టర్ వలీఉల్లాఖాద్రి, బి నర్సింహారావు, డాక్టర్ మందవీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో రాళ్లు మీదపడి కార్మికుడి దుర్మరణం



అమీర్‌పాషా(ఫైల్)

కేసముద్రం : ఓ క్వారీలో ఒక్కసారిగా 30 మీటర్ల ఎత్తు నుంచి రాళ్లు పడడంతో ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామ సమీపంలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం అర్పనపల్లి- తీగలవేణి గ్రామాల మధ్య గల మిడ్‌వెస్ట్ గ్రానైట్స్ లిమిటెడ్ క్వారీలో అర్పనపల్లి గ్రామానికి చెందిన షేక్ అమీర్‌పాషా(55) 30 సంవత్సరాల నుంచి దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం క్వారీలోపల బ్లాస్టింగ్ జరిపారు. ఆ తర్వాత అదే చోట అమీర్‌పాషా డ్రిల్లింగ్ చేస్తుండగా 30 మీటర్ల ఎత్తు నుంచి ఒక్కసారిగా రాళ్లు కూలి అతడి మీదపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకున్నారు. క్వారీ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే అమీర్‌పాషా మృతి చెందాడని, దీనిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేష్, కేసముద్రం ఎస్సై తిరుపతి, గూడూరు ఎస్సై రాణాప్రతాప్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహం, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు క్వారీ వద్దకు చేరుకుని రికార్డులు పరిశీలించారు. క్వారీలో బ్లాస్టింగ్ జరపడానికి అనుమతులున్నాయా.. లేదా అనే విషయంపై విచారణ చేయిస్తామన్నారు. దీంతో బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు శాంతించారు. మృతుడి కుమారుడు జానీపాషా ఫిర్యాదు మేరకు క్వారీ సూపర్‌వైజర్‌తోపాటు, నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కనుల పండువగా సందల్..



దర్గాలో ప్రార్థన చేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్, తదితరులు



అర్ధరాత్రి బడేఘర్ నుంచి గంధం తీసుకొస్తున్న మత పెద్దలు

- భక్తిశ్రద్ధలతో ఊరేగింపు
- భక్తులతో కిక్కిరిసిన దర్గా పురవీధులు

కాజీపేట రూరల్: కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి ప్రారంభమయ్యాయి. దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా బడేఘర్ నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన సందల్ (గంధం)ను ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. గంధంతో లేపనం చేసి గులాబీ పూల చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. కాగా, ఖుస్రూపాషా గంధంతో ఉన్న వెండి గిన్నెను తలపై పెట్టుకుని దర్గాకు తీసుకువస్తుండగా భక్తులు ఆ గిన్నెను తాకేందుకు పోటీ పడ్డారు. ఈ సందల్ కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి భక్తులు, పీఠాధిపతులు, మత పెద్దలు, సూఫీలు పాల్గొన్నారు.

కనుల పండువగా సందల్..

బడేఘర్ నుంచి అర్ధరాత్రి 12 గంటలకు సందల్ తీసుకుని ఊరేగింపుగా అర్ధరాత్రి 2గంటల వరకు దర్గాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, ఫకీర్ల విన్యాసాలు, యువకుల కేరింతలతో దర్గా ప్రాంగణం మార్మోగింది.

దర్గాను దర్శించుకున్న రేవంత్‌రెడ్డి

కాజీపేట దర్గాను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, కొండపల్లి దయాసాగర్, రవీందర్ ఉత్తమరావు దళ్వి, షబ్బీర్‌అలీ, అజ్మత్ హుస్సేన్, శోభారాణి, సాంబాని చంద్రశేఖర్, సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి, కొండా మురళి, సురేఖ, వేం నరేందర్‌రెడ్డి, దొమ్మాటి సాంబయ్య, ఎర్రబెల్లి స్వర్ణ, నమిండ్ల శ్రీనివాస్ దర్శించుకున్నారు. వీరికి దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా స్వాగతం పలికారు. అనంతరం పూలు సమర్పించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భక్తి యార్‌బియాబానీ, ముస్లిం మత పెద్ద షానావాజ్‌బేగ్, నాయకులు మట్టాడ కుమార్, వేణు, పి.శ్రీనివాస్, ఎల్.శ్రీను, అమర్ పాల్గొన్నారు.

దర్గాకు తరలివస్తున్న భక్తులు..

కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గాకు దేశ నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. భక్తుల కోసం పోలీసులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీఐ సార్ల రాజు, సిబ్బంది.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా దర్గా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో మెడికల్ ఆఫీసర్లు జోస్న, నవీన, వైద్య సిబ్బంది ఎస్.పద్మ, ఎస్.స్వరూప, ఎ.అశోక్, హెల్త్ అసిస్టెంట్ సురేష్.. భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

'విలీనం'పై మాట్లాడే హక్కులేదు



శివనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలవి కపట నాటకాలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ఖిలా వరంగల్: తెలంగాణ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులేనని, తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా బుధవారం వరంగల్ శివనగర్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం తమ్మెర భవన్ నుంచి రామాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామాలయ కల్యాణ మండపంలో పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఈనెల 17న విమోచన దినోత్సవం పేరిట బీజేపీ, జాతీయ సమైక్యతా దినం పేరిట బీఆర్ఎస్ పార్టీలు చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టేందుకేనని ఆరోపించారు. సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తుందని, నైజాంపై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తోందన్నారు. నాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమాత్రం లేదని, నిజమైన వారసులు కమ్యూనిస్టులేనన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్, బీజేపీలకు తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. సమావేశంలో పార్టీ నేతలు కర్రె భిక్షపతి, పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా, పనాస ప్రసాద్, వీరగోని శంకరయ్య, అక్కపెల్లి రమేష్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, దండు లక్ష్మణ్, గుంపెల్లి మునీశ్వరుడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు..

కాజీపేట అర్బన్ : రిజిస్ట్రేషన్ శాఖలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌ల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇందుకు గాను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 15 మంది సీనియర్ అసిస్టెంట్‌లు, 85 మంది జూనియర్ అసిస్టెంట్‌లు బదిలీ అయ్యే అవకాశం ఉంది. సీనియర్ అసిస్టెంట్‌లు జోన్ బదిలీల్లో భాగంగా కరీంనగర్, ఖమ్మం బదిలీ అయ్యే అవకాశం ఉండగా, జూనియర్ అసిస్టెంట్‌లు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. కాగా, మంగళవారం ఉత్తర్వులు వెలువడగా, బుధ, గురువారాల్లో పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

TRAINING

■ అతి తక్కువ ఫీజుతో బ్యూటీపార్లర్ & టైలరింగ్ (బోటిక్ వర్క్స్) లో ట్రైనింగ్ ఇవ్వబడును. టైలరింగ్ వర్క్ చేరుటకు యువతులు కావలెను. సుబేదారి. సెల్: 7981536392. [WA-603]

SERVICES

■ వరంగల్‌లో 25 సం॥లుగా నడుస్తున్న సూపర్ బజార్ (కిరాణ & జనరల్) అమ్మకమునకు కలదు. సెల్: 9704246421, 9949937545. [WA-16719]

■ శ్రీరామ్ గోల్డ్: మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించలేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ 9133214214. [H-788626]

WANTED

■ Urgent Requirement: Female Tele Callers in Corporate Finance Sector. Salary + Incentives. Job Location: Hanamkonda. Please Cont: 8886188690. [WA-7224]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000/- - 16000/- సంప్ర: 9000463426. [W-1229413]

■ రామకృష్ణ హోం కేర్ సర్వీస్ (డీలక్స్) VJA, HYD. శ్రీమంతులల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్/నర్సులు కావలెను భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 94413 84123, 94413 86123. [B-1206744]

■ హైదరాబాద్‌లో ఇంట్లో ఉండి వంటపనికి సీనియర్ సిటిజన్‌ను చూసుకోవటానికి 40-55 వయస్సు గల 10th చదివిన మగ మనిషి కావలెను. Ph: 7207914195 [H-781280]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్. 3K Ph: 9848571888 [H-189332]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 8186055849. [G-751670]

■ ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503. [G-1119]

WANTED TEACHERS

■ Wanted Teachers to teach Maths, Hindi & Supporting Teachers for 1st to 5th Classes (E/M) & Tutors 6th to 7th (5pm-7pm) Cont: 9963006221. [W-1229416]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.